# సిద్ధోగం వేడుకల్లో కేటీఆర్

గంభీరావుపేట రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు



రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మొక్కుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, మే 28 (నమస్తే తెలంగాణ)/ గంభీరావుపేట : గంభీరావుపేట మండలకేంద్రంలో మంగళవారం జరిగిన రేణుకా ఎల్లమ్మ సిద్ధోగం వేడుకలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేటీఆర్‌ను గౌడ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సకాలంలో వర్షాలు కురిసి, పచ్చని పంటలతో తెలంగాణ కోటి రతనాల వీణ కావాలన్నారు. వానకాలంలో పంటలు పండి అన్నదాత ఇంట్లో ధాన్యపు రాసులు కురువాలని కోరుకున్నారు. కరోనా, విషజ్వరాలు, ప్రాణాంతక వ్యాధుల బారిన రాష్ట్ర ప్రజలు పడకుండా కాపాడాలని వేడుకున్నారు. అనంతరం పార్టీ మండలశాఖ అధ్యక్షుడు వెంకటస్వామి గౌడ్, మాజీ ఉపసర్పంచ్ సింగారపు నాగరాజు గౌడ్, చేరాల వెంకటస్వామిగౌడ్, పాపాగారి యాదగిరి గౌడ్ నివాసాలకు వెళ్లి ఎల్లమ్మ సిద్ధోగ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన వెంట నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తదితరులు ఉన్నారు.

# జువ్వాడి ఆరోపణలు మానుకో

- కేసీఆర్‌ను విమర్శించే స్థాయి నీకు లేదు
- ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తే గెలుస్తవ్
- ఐదు నెలల్లో కాంగ్రెస్ దుర్మార్గపు పాలన
- బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు ధ్వజం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, పక్కన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల రూరల్, మే 28 : తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శించే స్థాయి జువ్వాడి నర్సింగరావుకు లేదని, ఇప్పటికైనా అనవసర ఆరోపణలు మానుకోవాలని బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు హితవు పలికారు. జగిత్యాల జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి ఆయన మాట్లాడారు. కోరుట్ల నియోజకవర్గంలో ఐదు సార్లు పోటీ చేసి ఓడిన నర్సింగరావు ఏదో పెద్ద నాయకుడిని అనుకొని మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో రెండో స్థానం, డిపాజిట్ రాని వ్యక్తి.. ఫోన్ ట్యాపింగ్ చేయడం వల్లే ఓడిపోయానని అనడం విడ్డూరంగా ఉందన్నారు. అందుబాటులో ఉండి, సేవ చేస్తే ప్రజలే గెలిపిస్తారని, తమను ఐదు సార్లు గెలిపించారని చెప్పారు. స్థానిక ప్రజాప్రతినిధులను భయబ్రాంతులకు గురి చేస్తూ కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారని విమర్శించారు. పదేళ్లలో స్వచ్ఛందంగా పార్టీలో చేరుతానంటే వారిని చేర్చుకున్నామని, ప్రజాప్రతినిధులను ఎలాంటి భయబ్రాంతులకు గురిచేయని పార్టీగా బీఆర్ఎస్ ఉందన్నారు. కాంగ్రెస్ ఐదు నెలల పాలన దుర్మార్గపు పాలన అని ధ్వజమెత్తారు. ఆ పార్టీ నాయకులు కేవలం సొంత డబ్బా కొట్టుకుంటున్నారని, రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగడం లేదని విమర్శించారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రజలు, వ్యాపారులు భయబ్రాంతులకు గురవుతున్నారని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఉద్యమ నాయకులని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో వారిని కించపరిచేలా మాట్లాడడం సరికాదని ఖండించారు. జడ్పీ చైర్‌పర్సన్ వసంత మాట్లాడుతూ, ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు అవాస్తవమని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రతిపక్ష నాయకులపై కక్షసాధింపు చర్యలు మానేసి ప్రజాపాలనపై దృష్టి పెట్టాలని హితవుపలికారు.

# రవాణా శాఖలో ఏసీబీ దాడులు



- మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు తనిఖీలు
- అవకతవకలు గుర్తింపు
- ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని స్పష్టం

స్లాట్ బుకింగ్ పత్రాలను పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు

తిమ్మాపూర్, మే 28 : కరీంనగర్ జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు చేశారు. మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఏసీబీ డీఎస్పీ రమణ మూర్తి, సీఐ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో రంగంలోకి దిగారు. ఒక్కసారిగా కార్యాలయంలోకి వచ్చి వాహనదారులు, సేవాదారుల నుంచి స్లాట్ బుకింగ్ పత్రాలు, ఇతర పత్రాలను తీసుకున్నారు. అనంతరం అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. డ్రైవింగ్, రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ కోసం వచ్చే వాహనాల పత్రాలను తీసుకుని ఒకొక్కరినీ పిలుచుకుంటూ పత్రాలను పరిశీలిస్తూ సేవలకు అంతరాయం కలుగకుండా సాయంత్రం వరకు తనిఖీలు చేపట్టారు.

### విచారణ కొనసాగిస్తాం : ఏసీబీ డీఎస్పీ

ఏసీబీ డీజీ ఉత్తర్వుల మేరకు రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించామని డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. తనిఖీల అనంతరం మీడియాతో మాట్లాడారు. కార్యాలయంలో అవకతవకలు గుర్తించినట్టు చెప్పారు. సేవల కోసం వచ్చే వాహనదాల నుంచి తీసుకోవాల్సిన దానికంటే ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించామని, మంగళవారం కార్యాలయానికి సేవల కోసం వచ్చిన వాహనదారుల నుంచి స్టేట్‌మెంట్లు తీసుకున్నట్టు చెప్పారు. వినియోగదారుల నుంచి ఏజెంట్లు అధిక నగదు తీసుకుని 'సీ', 'డీ' లాంటి కోడింగ్‌లు స్లాట్ పత్రాలపై ఇచ్చినట్టు గుర్తించామని వెల్లడించారు. ఈ గుర్తులున్న పత్రాలతో వచ్చిన వినియోగదారుల వివరాలు తీసుకున్నామని, వారిని విచారించి ఎవరి ప్రమేయం ఉన్నదో గుర్తించి.. శాఖా పరమైన చర్యలకు ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని చెప్పారు. అలాగే అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై తమ నిఘా ఉంటుందని స్పష్టం చేశారు.

# ఆధార్‌పై అపోహలు వద్దు

జూన్ 14 తర్వాత కూడా వినియోగం
ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి

కరీంనగర్ కలెక్టరేట్, మే 28 : ఆధార్‌కార్డులపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అపోహలను నమ్మ వద్దని, జూన్ 14 తర్వాత కూడా పని చేస్తాయని ఆధార్ ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం విలేకరులతో వివరాలు వెల్లడించారు. ఇప్పటికే భారత విశిష్ట ప్రాధికార సంస్థ (ఉడాయ్) ప్రకటన కూడా విడుదల చేసిందని తెలిపారు. పదేళ్ల క్రితం నమోదు చేసుకున్న తమ వివరాలను తిరిగి ఆధార్ కేంద్రాల్లో అప్‌డేట్ చేసుకోవాలని, ఈ యేడాది మార్చి 14 వరకు ఉడాయ్ అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అయితే, గడువు పొడిగించాలని ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు మరో మూడు నెలల పాటు జూన్ 14 వరకు అప్‌డేట్ చేసుకోవచ్చని తెలిపిందన్నారు. ఆన్‌లైన్‌లో ఉచితంగా, ఆధార్ కేంద్రాల్లో నిర్ణీత రుసుం చెల్లించి ఫోన్‌నెంబర్లు, ఫొటోలు, వేలి ముద్రలు, ఇతర వివరాలను తిరిగి నమోదు చేసుకోవచ్చని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సూచించారు. వివరాలు అప్డేట్ చేసుకోకున్నా కార్డులు ఎప్పటి మాదిరిగానే పనిచేస్తాయని స్పష్టం చేశారు. వయసు, సంబంధిత వ్యక్తి చేసే దైనందిన పనుల మూలంగా ముఖం, చేతి వేళ్లపై ఉండే చారలతో సమస్యలు వచ్చే అవకాశం ఉన్నందున అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు.

# షాడో ఎమ్మెల్యే!

## మానకొండూర్ నియోజకవర్గంలో హల్‌చల్



- ఎమ్మెల్యే పీఏగా చెప్పుకొంటూ వసూళ్లు?
- ఇసుక ట్రాక్టర్లు, దాబాలే కాదు.. వేటినీ వదలకుండా టార్గెట్లు
- లొంగకుంటే స్టేషన్‌లో కేసులు పెట్టిస్తూ ఇబ్బందులు
- వ్యాపారాలపై అధికారులతో దాడులు
- సదరు వ్యక్తి ఫోన్ వస్తే చాలు వణుకే..
- అధికారులకూ ముడుపుల బెడదే!
- వసూళ్లపై ఎదురు తిరిగిన యువకుడు
- సోషల్ మీడియాలో వాయిస్ వైరల్
- ఎమ్మెల్యేకు తెలుసా..? లేదా..? అన్నదానిపై జోరుగా చర్చ

**కరీంనగర్ జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న మానకొండూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పేరు చెపుతూ ఓ వ్యక్తి హల్‌చల్ సృష్టిస్తున్నాడు. అధికారికంగా నియామకం కాకపోయినా.. తానే అసలు పీఏనంటూ దందాలకు దిగుతున్నాడు. ఫాంహౌస్‌లు, కల్యాణ మండపాలు, దాబాలే కాదు.. ఇసుక ట్రాక్టర్ ఓనర్లు, రియలెస్టేట్, ఇతర వ్యాపారులు.. ఇలా ఏ ఒక్కరినీ వదలకుండా టార్గెట్లు పెట్టి మరీ వసూళ్లకు పాల్పడుతున్నాడు. అడిగినంత ఇవ్వకపోతే బెదిరించడం, కేసులు పెట్టించడం, లేదంటే వ్యాపారాలపై అధికారులతో దాడులు చేయిస్తున్నాడు. ఒక్క మాటలో చెప్పాలంటే.. నియోజకవర్గంలో షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నాడు. ప్రస్తుతం సదరు వ్యక్తి ఫోన్ వచ్చిందంటే చాలు వ్యాపారులే కాదు, అధికారులు బెంబేలెత్తిపోయే పరిస్థితి ఉన్నది. తహసీల్ ఆఫీస్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు.. నెలకింతా 'మామూలు' ఇవ్వాల్సిందేనంటూ హుకుం జారీ చేసి మరీ వసూలు చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఇటీవల ఓ ఇసుక ట్రాక్టర్ నడుపుకునే యువకుడికి ముడుపుల కోసం సదరు పీఏ ఫోన్ చేయడం.. ఆ యువకుడు తిరుగుబాటు చేసి నానా బూతులు తిట్టిన వాయిస్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. నియోజకవర్గంలో ఇంత జరుగుతున్నా.. కాంగ్రెస్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు ఈ వ్యవహారం తెలుసా..? లేదా? అన్న చర్చ జోరుగా నడుస్తున్నది.**

కరీంనగర్, మే 28 (నమస్తే తెలంగాణప్రతినిధి) : మానకొండూర్ నియోజకవర్గంలో కొద్దిరోజులుగా 'మామూళ్ల దందా' నడుస్తున్నది. 'కాంగ్రెస్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అసలు పీఏ నేనే' అంటూ ఓ వ్యక్తి హల్‌చల్ సృష్టిస్తున్నాడు. నిజానికి ఆయన అధికారిక పీఏ కాదు.. అయినా బెదిరింపులు మాత్రం 'మామూలు'గా లేవు. నియోజకవర్గంలోని వివిధ రకాల వ్యాపారులు, ఇసుక ట్రాక్టర్ యజమానులు, ఫాంహౌస్‌లు కట్టుకున్నవాళ్లు, దాబాలు నడుపుకొనే వాళ్లు, రియలెస్టేట్ వ్యాపారు లు, మిలర్లు, గ్రానైట్ వ్యాపారులు.. ఇలా ఏ ఒక్కరినీ విడిచి పెట్టడం లేదు. ఏమాత్రం జంకూ బొంకు లేకుండా నేరుగా ఫోన్లు చేసి వసూళ్లకు పాల్పడుతున్నాడు. అడిగిన మొత్తం సమర్పించుకోక పోతే.. ఏకంగా పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదవుతున్నాయనే విమర్శలున్నాయి. లేదా బైండోవర్ పేరిట బెదిరింపులు వస్తున్నాయి. లోతుగా చూస్తే ఒకటి రెండు కాదు.. కోకొల్లలుగా బయట పడుతున్నాయి.

### ఫాంహౌస్‌తో మొదలు

మానకొండూర్ నియోజకవర్గంలో ఓ వ్యక్తి ఫాంహౌస్ కట్టుకున్నాడు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చీ రాగానే.. సదరు పీఏ కన్ను ఫాంహౌస్‌పై పడింది. 'మీరు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేశారు? కూల్చివేయకుండా ఉండాలంటే ₹30 లక్షలు ఇస్తావా..? చస్తావా..?' అంటూ బెదిరింపులకు దిగినట్టు సమాచారం. సదరు ఓనర్ ఈ విషయాన్ని కాంగ్రెస్‌కు పార్టీకి చెందిన ఓ మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టుగా తెలుస్తున్నది. మంత్రి చెప్పినా బేఖాతర్ చేసిన సదరు వ్యక్తి.. 'నేను డబ్బులు అడిగితే మంత్రి దృష్టికి తీసుకెళ్తావా..?' అంటూ బెదిరించడంతోపాటు ఆ విషయాన్ని మనసులో పెట్టుకొని 'నీవు ఫాంహౌస్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినవ్. కూల్చివేస్తా'మంటూ సదరు అధికారులతో నోటీసులు జారీ చేయించారు. పరిస్థితిని గమనించి సదరు ఫాంహౌస్ యజమాని హైకోర్టును ఆశ్రయించి.. ఇబ్బందులు లేకుండా చూసుకున్నట్టు తెలుస్తున్నది. ఆయనొక్కడే కాదు.. మానకొండూర్ నియోజకవర్గంలో ఫాంహౌస్‌లు, కల్యాణ మండపాలు నిర్మించుకున్న ప్రతి ఒక్కరూ ఇలాంటి బెదిరింపులకు లోనైనట్టు నియోజకవర్గంలో చర్చలు నడుస్తున్నాయి. చివరకు నియోజకవర్గంలో ఇల్లిల్లూ తిరిగి రేషన్ బియ్యం కొని విక్రయించి డబ్బులు సంపాదించుకునే గన్నేరువరం మండలానికి చెందిన ఓ వ్యక్తినీ వదల్లేదు. పీఏగా చెప్పుకుంటున్న తనకు 'నెలకు ₹15 వేలు ఇవ్వాల్సిందే' నంటూ పట్టుబట్టాడు. 'నా నుంచి కాదన్నా' అని చెప్పినా వినకుండా సదరు వ్యక్తిపై నియోజకవర్గంలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయించి లొంగదీసుకున్నట్టు తెలుస్తున్నది.

### అన్ని వర్గాలకూ బెదిరింపులు

'ఇంకా నియోజకవర్గంలోని ప్రధాన రహదారులపై ఉన్న దాబాల యజమానులు ప్రతి నెలా ₹10 వేలు ఇవ్వాల్సిందే. మీరు కమర్షియల్ సిలిండర్ వాడుతున్నారా..? లేక రెసిడెన్షియల్ వాడుతున్నారా..? అంటూ తనిఖీలు. తాను చెప్పినట్టు వినకపోతే పోలీస్ రైడింగ్‌లు ఉంటయ్' ఇలా సదరు వ్యక్తి బెదిరింపులకు దిగుతుండడంతో చాలా మంది తలొగ్గినట్టు తెలుస్తున్నది. ఇదే నియోజకవర్గంలో బొగ్గు వ్యాపారం చేసే వ్యక్తి నుంచి నెలకు ₹15 వేలకు ఒప్పందం కుదిరినట్టు తెలుస్తున్నది. ఈ నియోజకవర్గంలో ఇంజినీరింగ్ కళాశాలలు చాలా ఉన్నాయి. వాటి పరిధిలో పది నుంచి పదిహేను మంది వరకు ప్రైవేట్ హాస్టళ్లు నడిపిస్తున్నారు. అయితే, రెసిడెన్షియల్ పరిష్మన్లు తీసుకొని కమర్షియల్ హాస్టల్ ఎలా నడుపుతారంటూ వారిని బెదిరించడమే కాదు, ఒకరిద్దరికి అధికారులతో నోటీసులు ఇప్పించినట్టు తెలుస్తున్నది. దీంతో హాస్టల్ నిర్వాహకులు రాజీకి వెళ్లగా.. ఒక్కో హాస్టల్ నుంచి నెలకు ₹10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసి ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిసింది. రియలెస్టేట్ వ్యాపారులకూ ఈ ముడుపుల బాధ తప్పలేదు. ఇటీవల ఐదెకరాలు రియలెస్టేట్ చేసిన ఓ వ్యక్తి నుంచి లక్షలు వసూలు చేసినట్టు తెలుస్తున్నది. ఇసుక క్వారీలు.. అది అధికారికంగా ఉన్నా సరే.. అనధికారికంగా ఉన్నా సరే... ప్రతి ఇసుక ట్రాక్టర్ నుంచి నెలకు ₹10 వేలు కావాలని సదరు వ్యక్తి డిమాండ్ చేశాడు. ఇవ్వకుంటే స్టేషన్‌లో కేసు నమోదు చేయించి మరీ లొంగదీసుకుంటున్నాడు. రైస్ మిల్లర్లకూ బెడద తప్ప లేదు. మిల్లులోని లోపాలను ఆసరాగా చేసుకొని నేరుగా డిమాండ్ చేస్తూ ముడుపులు వసూలు చేస్తున్నాడు. లేదంటే విజిలెన్స్ దాడులకు సిద్ధంగా ఉండాలంటూ హెచ్చరిస్తున్నాడు. గ్రానైట్ వ్యాపారులను కూడా ఇలానే బెదిరిస్తున్నాడు. ఇవి కేవలం మచ్చుకు మాత్రమే కాగా, ఇలా కోకొల్లలుగా వెలుగులోకి వస్తున్నాయి.

### అధికారులకూ తప్పని బెడద?

ప్రైవేటు దందాలు, వ్యాపారులు చేసుకునే వారికే కాదు.. అధికారులకూ ఈ బెదిరింపులు తప్పడం లేదని తెలుస్తున్నది. తహసీల్దార్, ఎంపీడీవోలతో పాటు కొన్ని పోలీస్‌స్టేషన్లకు ప్రతి నెలా ఇంత ఇవ్వాలని టార్గెట్ పెట్టినట్టు తెలుస్తున్నది. పీఏ అని చెప్పుకుంటున్న సదరు వ్యక్తి బాహాటంగానే అధికారుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. దీని ప్రకారం ఏకంగా పోలీసులనే బ్లాక్ మెయిల్ చేస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి. 'మీరేం వసూలు చేసుకుంటారో చేసుకోండి. మేం అడిగింది మాత్రం మాకు రావాల్సిందే'నంటూ హుకుం జారీ చేసినట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం ఈ విషయంపై అధికారవర్గాల్లో జోరుగా చర్చ నడుస్తున్నది.

### ఎదురు తిరిగిన యువకుడు

ఇదిలా ఉండగా.. ఇటీవల ఇసుక ట్రాక్టర్ నడుపుకునే ఓ యువకుడికి ఈ పీఏ ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడినట్టుగా ప్రచారం జరుగుతున్నది. దాంతో సదరు యువకుడు.. 'నాకు ఫోన్ చేయడానికి నువ్వెవరు' అంటూ నిలదీశాడు. ప్రస్తుతం వీరిద్దరి మధ్య జరిగిన సంభాషణ లీకయింది. ఇది సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. అయితే, ఈ యువకుడిని సైతం దారికి తెచ్చుకునేందుకు ఇటీవల పార్లమెంట్ ఎన్నికల సమయంలో బైండోవర్ పేరిట స్టేషన్‌కు పిలిపించి బెదిరించినట్టు తెలుస్తున్నది.

### ఎమ్మెల్యేకు తెలుసా.. లేదా..?

మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీకి చెందిన కవ్వంపల్లి సత్యనారాయణ కొనసాగుతున్నారు. ఆయన వృత్తి రీత్యా డాక్టర్. వృత్తి పరంగా మంచి పేరున్నది. ప్రజలు మంచి మెజార్టీ ఇచ్చి గెలిపించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగానూ కొనసాగుతున్నారు. అయితే, ఆయన సొంత నియోజకవర్గంలో ఈ వసూళ్ల దందా జరగడం.. మామూళ్లకు పాల్పడే వ్యక్తి ఎమ్మెల్యే పేరు వాడుకోవడం.. తానే అసలు పీఏనంటూ బెదిరింపులకు దిడం.. ఏ ఒక్కరినీ వదలి పెట్టకుండా టార్గెట్లు పెట్టి మరీ వసూళ్లకు పాల్పడడం.. వినకుంటే కేసులు పెట్టించడం.. లేదా సంబంధిత శాఖల అధికారులతో బెదిరింపులకు దిగుతున్న తీరు.. ప్రస్తుతం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ప్రతి నలుగురు కలిసిన చోట ఈ విషయంపై జోరుగా చర్చ జరుగుతున్నది. అంతేకాదు, వసూళ్లకు పాల్పడుతున్నది ఎవరన్న విషయం అందరికీ తెలిసిందే అయినా.. ఈ వ్యవహారం ఎమ్మెల్యేకు తెలుసా..? లేదా..? అన్నది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా ఉన్నది. ఇన్ని ఆగడాలు సృష్టిస్తున్న సదరు వ్యక్తి గురించి కాంగ్రెస్ పార్టీలోనూ బహిరంగంగానే చర్చ జరుగుతున్నది. అంతేకాదు, అడుగడుగునా ఎమ్మెల్యే సత్యనారాయణను బద్నాం చేసేలా సదరు వ్యక్తి ప్రవర్తిస్తున్నాడన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా ఎమ్మెల్యే సదరు వ్యక్తిపై చర్యలు తీసుకుంటారా..? లేదా..? అన్నది చూడాలి. ఈ వ్యవహారంలో ఎమ్మెల్యేకు సంబంధం లేకపోతే.. వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ ప్రజల నుంచే కాదు, సొంత పార్టీ శ్రేణుల్లోనూ వ్యక్తమవుతున్నది. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యే స్పందిస్తారా..? లేదా..? అన్నదానిపైనే ప్రస్తుతం నియోజకవర్గమంతా చర్చ నడుస్తున్నది.

# ఆవిర్భావ వేడుకలు అంబరాన్నంటాలి

- కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పక్కన మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, మే 28: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు అంబరాన్నంటేలా నిర్వహించాలని, కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. గోదావరిఖనిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. వచ్చే నెల ఒకటి నుంచి మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా వేడుకలు జరుగుతాయని తెలిపారు. ఒకటిన హైదరాబాద్‌లోని గన్‌పార్కు వద్ద అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం కొవ్వొత్తులతో ర్యాలీ ఉంటుందని, 2న తెలంగాణ భవన్‌లో ప్రత్యేక వేడుకలు ఉంటాయని చెప్పారు. ఇక 3న జిల్లా కేంద్రాల్లోని పార్టీ కార్యాలయాల్లో వేడుకలకు కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు మాదాసు రాంమ్మూర్తి, గోపు ఐలయ్య, అచ్చ వేణు నాయకులు పాల్గొన్నారు.

# భూ కబ్జా ఘటనలో ముగ్గురిపై కేసు

- జగిత్యాల టౌన్‌లో ఫిర్యాదు
- చర్యలకు ఉపక్రమించిన పోలీసులు

నమస్తే ఎఫెక్ట్

జగిత్యాల కలెక్టరేట్, మే 28 : 'జగిత్యాల మున్సిపాలిటీలో భారీ భూ బాగోతం' శీర్షిక న 'నమస్తే తెలంగాణ'లో సోమవారం ప్రచురితమైన కథనం సంచలనం సృష్టిస్తున్నది. సోమవారం ఏకంగా కలెక్టర్ విచారణకు మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించగా.. మంగళవారం జగిత్యాల టౌన్ పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. తప్పుడు పత్రాలు సృష్టించి భూ కబ్జాకు ప్రయత్నించిన ముగ్గురిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని జగిత్యాల సీఐ వేణుగోపాల్ వెల్లడించారు. ఆయన వివరాల ప్రకారం.. జగిత్యాల మున్సిపల్ పరిధిలోని సర్వే నంబర్ 1599లో ఉన్న 12 గుంటల భూమిని కీర్తి విజయలక్ష్మి, వూటూరి గీతారాణి, కొత్తపెల్లి సత్యనారాయణ 2011లో పుల్ల భాగ్యలక్ష్మి నుంచి కొనుగోలు చేశారు. అయితే, స్థలం ఖాళీగా ఉండడంతో జగిత్యాల పట్టణానికి చెందిన ఖాజీ అమీరుద్దీన్, మరో ఇద్దరు వ్యక్తులు నకిలీ, ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి వీఎల్‌టీ కట్టి స్థలాన్ని కబ్జా చేశారని స్థల యజమాని విజయలక్ష్మి ఫిర్యాదు చేసింది. అమీరుద్దీన్‌తో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

# లింక్ ఓపెన్..

## ₹9.60 లక్షలు మాయం

- లబోదిబోమన్న హోల్‌సేల్ వ్యాపారి
- ఖనిలో ఘరానా సైబర్‌క్రైమ్
- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

ఫర్టిలైజర్‌సిటీ, మే 28: బ్యాంకు పేరుతో వచ్చిన లింకును ఓపెన్ చేయగానే రెండు గంటల వ్యవధిలోనే రూ.9.60 లక్షలు విత్‌డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో ఖంగుతిన్న బాధితుడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. గోదావరిఖనిలో జరిగిన ఘరానా సైబర్ క్రైమ్‌కు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.గోదావరిఖని పట్టణంలోని స్థానిక చికెన్ మార్కెట్ హాలో సెల్ వ్యాపారి దేవేందర్ సెల్‌ఫోన్‌కు యూనియన్ బ్యాంకు పేరిట ఓ లింకు వచ్చింది. దానిని దేవేందర్ ఓపెన్ చేయగా, రెండు గంటల తర్వాత సెల్‌ఫోన్‌కు బ్యాంకు నుంచి రూ.9.60 లక్షల విత్ డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో ఒక్కసారిగా ఖంగుతిన్న బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

# ఇద్దరు దొంగలు.. 21 బైక్‌లు

- అన్నీ ఒకే కంపెనీకి చెందిన వాహనాలు ఎత్తుకెళ్లిన ఘనులు
- తాజాగా నిందితుల అరెస్ట్

కరీంనగర్ రాంనగర్, మే 28 : దొంగల్లో ఈ దొంగలు. బైక్ చోరీలంటే ఎవరైనా ఏ బైక్ దొరికితే ఆ బైక్ ఎత్తుకెళ్తారు. కానీ ఈ ఇద్దరు చోరులు మాత్రం అన్నీ ఒకే తరహా బైక్‌లను ఎత్తుకెళ్లడంలో స్పెషలిస్టులుగా మారారు. ఇలా ఒకటి.. రెండు కాదు, ఏకంగా 21 బైక్‌లను చోరీ చేశారు. మంగళవారం కరీంనగర్ కమాన్ చౌరస్తా వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఆ ఇద్దరు నిందితులు పోలీసులకు చిక్కారు. తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామానికి చెందిన గోనెల శంకర్, బోయిని చంద్రబాబుగా గుర్తించారు. నిందితులిద్దరి నుంచి మొత్తం 21 ద్విచక్ర వాహనాలను రికవరీ చేశామని కరీంనగర్‌టౌన్ ఏసీపీ నరేందర్ తెలిపారు. కరీంనగర్ వన్ టౌన్ పరిధిలో 15, ఎల్ఎండీ పరిధిలో 5, కరీంనగర్ టూటౌన్ పరిధిలో 3, గన్నేరువరం, కొమురవెల్లి పరిధిలో ఒకటి చొప్పున బైక్‌లు ఉన్నాయని చెప్పారు. నిందితులిద్దరిపై కేసు నమోదు చేశామని కరీంనగర్ వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ జే సరిలాల్ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన వన్ టౌన్ ఎస్ఐ స్వామితో పాటు సిబ్బందిని టౌన్ ఏసీపీ అభినందించారు.

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం
మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక..
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..



ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571